# మనిషికీ మనసుకూ మధ్య

గుమ్మా ప్రసన్నకుమార్

భోరున వర్షం కురుస్తుంటే, అన్ని తలుపులూ వేసేసి, వాలుకుర్చీలో కూర్చొని సిగరెట్టు కాలుస్తూ, వర్షం శబ్దాన్ని వినడం రమణమూర్తిగారి ఇష్టాలలో ఒకటి.

ఆరోజు వర్షం కురుస్తోంది.

రమణమూర్తిగారు లేచి కిటికీ తలుపులు తెరిచారు. ఒక్క క్షణం ఆ వర్షపుజల్లు మీద పదేట్లుగా నిల్చొని, మళ్ళీ కిటికీ మూసేశారు. వాలు కుర్చీలో కూర్చుని సిగరెట్టు వెలిగించి, పొగ వదిలారు. చూరునించి కారే వర్షపుధార మెట్లమీద పడుతూ వింత శబ్దాలు చేస్తోంది ఈ సమయంలో హాయిగా ఉండవలసిన రమణమూర్తి గారి మనస్సు ప్రశాంతంగా లేదు. నిశ్చింతగా లేదు అవ్యక్తమైన బాధ హృదయాన్ని నలిపేస్తోంది.

రెండోకొడుకు రామచంద్రం రాసిన ఉత్తరాన్ని మరోమారు తీసి చదవడానికి ఆయనకు భయమేసింది. ఆ ఉత్తరానికి జవాబు రాసేందుకు రామచంద్రం ఆయనకు పదిరోజుల గడువు ఇచ్చాడు. ఈలోపుగా పదీ ఆలోచించి జవాబు రాయమన్నాడు. ఆ ఉత్తరానికి ఆరోజే జవాబు రాసేద్దామనుకున్నారు రమణమూర్తిగారు. తను అనుకున్నదీ, ఆచరించేదీ ఎప్పుడూ ఒకటే - మార్పుండదు ఆ జవాబు ఇప్పుడు రాసినా, పదేళ్ళ తరువాత రాసినా, దాని సారాంశం ఒకటే అవుతుంది. ఇవి ఆయనకు తెలుసు. కొడుకు తీసుకున్న నిర్ణయం రమణమూర్తిగారికి నచ్చలేదు; కోపం వచ్చింది. అదే విషయం రాద్దామని కూర్చున్నారు ఆ సమయంలో తలుపు తట్టిన చప్పుడు వినిపించింది ఆయనకి.

పెన్నూ, కాగితం బల్లమీద పెట్టారు మెల్లిగా లేచి తలుపు తీశారు. ఎదురుగా మనిషిని చూస్తూనే అడిగారు: "ఎవరూ?"

"నేను మాష్టారూ... నేను" వణుకుతూ సమాధానం వచ్చింది.

ఆయన జుత్తంతా చిందరవందరగా వుంది. తల నుండి నీళ్ళు కారుతున్నాయ్. బట్టలు తడిసి వంటికి అతుక్కున్నాయ్.

"రండి వెంకట్రావుగారూ, రండి .. వర్షంలో బాగా తడిసిపోయారు." ఈ సమయంలో ఆ మనిషి రావటం రమణమూర్తిగారికి ఆశ్చర్యం కలిగిం

చింది. మళ్ళీ అన్నమాటే అన్నారు:
"బాగా తడిసిపోయారు"

"అవును," జుత్తును ఒకసారి ఎగదోసుకున్నారు వెంకట్రావుగారు, రెండు చేతులతోనూ మొహంమీ దున్న నీళ్ళని తొలగించేరు.

రమణమూర్తిగారు లోపలికి వెళ్ళి తువ్వాలు తెచ్చిచ్చారు. "కూర్చోండి," అన్నారు.

వెంకట్రావుగారు కూర్చున్నారు. "భోజనం అయిందనుకుంటాను?" తల తుడుచుకుంటునే అడిగేరు.

"ఆఁ ఇప్పుడే అయింది...మీది?"

"నాదా?...తిన్నాను – లేదు"

ఆశ్చర్యంగా చూశారు రమణమూర్తిగారు.

"తినలేకపోయాను," వెంకట్రావుగారి మాటలు బాధగా వినవచ్చాయి ఆ మాటల వెనుక ఆయన చెప్పబోతున్నదానికి ఉపోద్ఘాతము ఉందనిపించింది రమణమూర్తిగారికి.

"అదేం?"

"అదంతే మాస్టారూ.. ఈ విషయంలో మిమ్మల్నొకటి కోరుతున్నాను. నాకు తిండి సహించేట్లు చేయగలరా మాస్టారూ!"

రమణమూర్తిగారికి నవ్వు వచ్చింది బలవంతాన ఆపుకున్నారు. "నేను డాక్టర్ను కాను వెంకట్రావుగారూ!"

"నా బాధ మీ కర్థం కాదు;" వెంకట్రావుగారి కళ్ళల్లో నీళ్ళు సుళ్లు తిరగడంచూశారు రమణమూర్తిగారు. అంతలోనే బాధపడ్డారు–అనవసరంగా వెంకట్రావుగారి మనసు నొప్పించానేమోనని.

ఆ ఊరి బడిపంతులుగా, హెడ్మాష్టరుగా రమణమూర్తిగారి అనుభవాలు, ఆ ఊళ్ళో ఆయన దగ్గర సలహా పొందవలసిన మనిషిగా ఓ ముద్ర ఉంది. అతని పండిన జుత్తు గతించిన అనుభవాల గుర్తు

రమణమూర్తిగారు విస్మయంగా చూశారు "చెప్పండి," అన్నారు.

వెంకట్రావుగారు మాట్లాడలేదు. బల్బు చుట్టూ తిరుగుతున్న పురుగునో క్షణం చూసి, "శ్రీనివాసమూర్తి మీకు తెల్సు ననుకుంటాను," అన్నారు నాందిగా.

"ఎవరూ?" ముందుకు వంగి కుతూహలంగాఅడిగారు రమణమూర్తిగారు.


"మా అబ్బాయి...శ్రీనివాసు."

"నల్లగా, పొడుగ్గా ... బి ఏ చదువుతున్నాడు కదూ!"

"అవును, వాడే."

"ఏమయింది?"

"ముందీ ప్రశ్నకు సమాధానం చెప్పండి మాస్టారూ ... మీ కో అబ్బాయి ఉన్నాడు. మీ ఆశలన్నీ వాడిమీదే. వాడేదో ప్రయోజకుడవు




తాడనీ, మీరు చెప్పిన మాటలు విని వృద్ధిలోకి వస్తాడనీ అనుకోరూ?"

"సహజం"

"అయితే, వాడు మీ ఆశలన్నీ నట్టేట ముంచినట్లు చేస్తే మీ కెలా వుంటుంది?"

ఈ రకం సంభాషణ మరొకప్పుడయితే అదోవిధంగా పొడిగిస్తూ రామణమూర్తిగారు ఆనందించేవారేమో! దీని కాయన సమాధానము చెప్పలేదు. ఆయన చూపు కొడుకు రాసిన ఉత్తరంమీదకు మళ్ళింది.

"ఒక్కగా నొక్క కొడుకని మురిసిపోయాను. వాడిమీదే ఆశలన్నీ పెంచుకున్నాను. మీలాటి పెద్దమనుషు లందరూ నా కొడుకు మంచివాడనీ, తెలివయినవాడనీ, వృద్ధిలోకి వస్తాడనీ అంటూంటే మురిసిపోయాను. ఇప్పుడు నేను పడుతున్న బాధ మీకర్థం కాదు. శ్రీనివాసు నా కెదురు చెప్తాడని అనుకోలేదు. కలలోకూడా తలచలేదు..." ఆగి రమణమూర్తిగారి మొహంలోకి చూశారు వెంకట్రావుగారు.

రమణమూర్తిగారు మంచి వ్యవహారికమైన మనిషి. ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడకూడదో ఆయనకు తెలుసు. వెంకట్రావుగారి ధోరణి అలా సాగనియ్యడమే అతని అభిమతం.

"ఇంటి పెద్దగా, శ్రీనివాసు నాన్నగా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా నా పని నిర్వర్తించబో

యాను. మీరు చెప్పండి మాస్టారూ! శ్రీనివాసు శ్రేయోభిలాషిగా నేనో నిర్ణయం తీసుకోడం తప్పా?"

రమణమూర్తిగారు తల అడ్డంగా తిప్పారు.

"అయితే నేను తప్పు చేయలేదన్న మాటేగా?"

ఆయన ధోరణి రమణమూర్తిగారికి సరదాగా ఉంది.

"సరేనండీ. రావుబహద్దురుగారిని మీరు ఎరుగుదురు. వారి కుటుంబం, వంశం, ప్రతిష్ట మీకు తెలియనివి కావు అలాంటి ఆయన తమంతట తాముగా వచ్చి మాతో వియ్యమొందాలనికోరిక వుందని చెప్పినపుడు, నా సంతోషం మీకు తెలీదు. పిల్లని చూశాం; బంగారు బొమ్మ శ్రీనివాసుకి అన్నివిధాలా తగినదనే నా అభిప్రాయం ఆస్తికి ఆస్తి ఉంది."

అప్పటికి రమణమూర్తిగారికి, వెంకట్రావుగారు చెప్పబోయే దేమిటో పూర్తిగా బోధపడింది తరువాత, తండ్రీ కొడుకులకు జరిగిన సంభాషణ ఊహించుకొన్నారు. కొడుకు ఎవరినో ప్రేమించిఉంటాడు అమాటే తండ్రితో ధైర్యంగా చెప్పేసిఉంటాడు కలలో కూడా కొడుకు తన కెదురు చెప్తాడని ఊహించని వెంకట్రావుగారు దాంతో తల్లక్రిందు లైపోయివుంటారు

బల్లమీదున్న ఉత్తరం గాలికి ఎగిరి క్రింద పడింది. దాన్ని తీసి బల్లమీద పెట్టి, దానిమీద పుస్తకం పెట్టారు.

"సరే, ఎవరినో ప్రేమించాను అంటాడు ఈనాటి యువకులకు అది కొత్త కాదు. అప్పు డడిగాను, ప్రేమించింది ఎవరినని.. ఎవరో పిల్లట మన కులం కాదట. మన గోత్రం కాదట. నే నేం చేయను మాస్టారూ! పోనీ, కులం గోత్రం కలిసొచ్చే పిల్లని ఎవరినైనా చేసుకో అన్నాను నేను కాదంటేక దా!"

రమణమూర్తిగారు మాట్లాడలేదు. ఆయన మనస్సులో కొడుకు రాసిన ఉత్తరం కదుల్తోంది. బాధపెడుతోంది.

"నేను కాదంటే కదా! కానీ, వాడు ఒకటే పట్టు పడుతున్నాడు. ఆ అమ్మాయినే చేసుకుంటాడట లేకపోతే బ్రహ్మచారిగా ఉండిపోతాడట. ఇదేం బావుంది చెప్పండి"

రమణమూర్తిగారికి ఏం చెప్పడానికీ తోచక, తల వంచుకున్నారు.

"మాస్టారూ!"

రమణమూర్తిగారు తలెత్తారు

వెంకట్రావుగారు లేచి, రమణమూర్తిగారి దగ్గరగా వచ్చి, ఆయన రెండు చేతులూ పట్టుకుని దీనంగా అన్నారు. "నాకున్న పరువు ప్రతిష్టల గురించి మీకు తెలుసుకదా! శ్రీనివాసు మనసు మార్చండి మాస్టారూ అందుకే


వచ్చును. శ్రీనివాసుకు [illegible] గురి ఈ చిన్న విషయంలో శ్రమ తీసుకోండి మాష్టారూ! నా అభ్యర్థనని అంగీకరిస్తారు కదూ!"

రమణమూర్తిగారు చేతులు వెనక్కి తీసుకున్నారు. ఏం మాట్లాడ్డానికీ ఆయనకు పాలుపోలేదు

వెంకట్రావుగారి మాటలు గద్గదంగా వినిపించేయి. "మాష్టారూ! మీకు తెలియదు, నేనెంత బాధపడుతున్నానో. నేను చెప్పినట్లు వినక, శ్రీనివాసు వాడు ప్రేమించిన అమ్మాయినే వివాహం చేసుకుంటే... ఇంక నాకూ ఈ లోకానికీ ఋణం తీరిపోతుంది."

రమణమూర్తిగారు ఉలిక్కిపడ్డారు, ఈ మాటలతో. ఆయన కళ్ళనుండి రెండు కన్నీటిచుక్కలు బుగ్గలమీదుగా జారి ఉత్తరీయంలో ఇంకిపోయాయి. తమాయించుకున్నారు. ఒక్క నిముషం ఆగి అన్నారు "నన్ను ఓ క్షణం ఆలోచించుకోనివ్వండి."

వాలుకుర్చీలో వెనక్కి చేరగిలబడి కళ్లు మూసుకున్నారు. ఒక కంటిమీద రామచంద్రం, మరో కంటిమీద శ్రీనివాసు కనిపిస్తుంటే, బాధను లోలోపలే అణచుకొని అన్నారు: "వెంకట్రావుగారూ! ఒక్కమాట చెప్తాను, కోపగించుకోరుకదా!"




"నా శ్రేయస్సును కోరే మిమ్మల్ని కోపగించుకుంటానా మాష్టారూ?"

"చూడండి వెంకట్రావుగారూ! కాలం మననాటిది కాదు. బండి చక్రంలా తిరిగిపోతోంది. దాంతో పాటే మనుష్యులూ, మనస్తత్వాలూనూ. ఇప్పుడు సంఘం మనుష్యులు మడికట్టుకుని కూర్చోటంలేదు, పూర్వంలాగా. చూస్తున్నారుగా! మన కాలా

నికీ ఇప్పటికీ చూస్తుండగానే ఎంత మార్పు వచ్చిందో! కుల మత భేదాలు ఎగిరిపోయాయి. పరిస్థితులన్నీ తారుమారయాయి. అంచేత నా సలహా ఏమిటంటే, పాత ఆచారాలకి నీళ్ళు వదిలెయ్యాలి. ఇప్పుడు మారుతున్న ప్రస్తుత ప్రపంచానికి అనుగుణంగా మారాలి. మారకపోతే, మనం చేసే ప్రయత్నాలు మనకే మిగిలి, ఫలితం కనబడదు" రమణ మూర్తిగారు కళ్ళు తెరిచారు.

వెంకట్రావుగారి మొహంలో కొట్టొచ్చినట్లు మార్పు కనబడుతోంది. అధరాలు కంపిస్తున్నాయి. భ్రుకుటి ముడిపడింది దీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు విడుస్తున్నారు.

"అంటే?"

"అదే," అన్నారు తాపీగా రమణ మూర్తిగారు.

కోపంగా లేచారు వెంకట్రావుగారు. "ఏదో అనుకున్నాను రమణమూర్తిగారూ మరేదో గొప్ప సలహా చెప్తారని, మా శ్రేయోభిలాషులని అనుకున్నాను. మీరు ఇలాంటి సలహా చెప్తారనుకుంటే, పనిగట్టుకుని అంతదూరం నుండి తడిసి వచ్చేవాడిని కాను. చాలు మాస్టారూ, చాలు మీకూ మీ సలహాలకీ ఓ నమస్కారం" తలుపు తీసుకుని వర్షంలోనే బయటకు నడిచారు, వెంకట్రావుగారు.

రమణమూర్తిగారు నిర్వ్వెరపోయారు. వెర్రిగా ఆయన వెళ్ళే వేపే చూస్తూ కూర్చుండిపోయాడు. మెదడు మొద్దుబారిపోయింది. ఆ రాత్రి ఆయనకు నిద్రపట్టలేదు 'అవును! శ్రీనివాసుకే చెప్పి చూడవలసింది,' అనుకున్నారు పదిసార్లు. ఆ ఆలోచనల్లోనే రామచంద్రం వచ్చాడు. బాధతో మెలికలు తిరిగిపోయారు. బుర్ర వేడెక్కింది. మరి ఆలోచించలేకపోయారు.

తెల్లారింది మొహం కడుక్కుని కాఫీ తాగుతుంటే 'ఎవరో వచ్చా' రన్న వార్త అందజేశారు రమణ మూర్తిగారికి. కాఫీ తాగి బయటకు వచ్చారు.


• ఎదురుగా కూర్చున్న మనిషి రమణ మూర్తిగారిని చూడడంతోనే లేచి నించుని, "నమస్కారమండీ!" అన్నాడు.

"ఎవరూ? శ్రీనివాసా... ఏమోయ్ కులాసాయేనా?" నిన్నటి సంభాషణ గుర్తుకు వచ్చింది. వెదకబోయిన తీగ కాలికే చుట్టుకున్నట్టు శ్రీనివాసే తన దగ్గరకు రావడం ఆయనకి సంతోష మయింది. ఆమాటే అన్నారు. "సమయాని కొచ్చావు."

శ్రీనివాసు మాట్లాడ లేదు. ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

"ఏమిటి ఇలా వచ్చావ్?"

"చిన్న పనిమీద మాస్టారూ... ఏమిటో మాస్టారూ, మీరు కోపగించు




కోనంటే చిన్న విషయం చెప్తాను. చెప్పమంటారా?"

"చెప్పు."

మనిషి పెద్దవాడవుతున్నకొద్దీ చాదస్తాలు పెరుగుతున్నాయండీ. పోనీ, ఆ చాదస్తాలను తమలోనే ఉంచుకుంటారా అంటే అలాకాదు; ఇవతలవాళ్ళమీద రుద్దుతారు. ఇది బావుందా మాష్టారూ!"

తెలిసిన విషయమే కాబట్టి ఈ డొంకతిరుగుడు మాటలతో తికమక పడలేదు రమణమూర్తిగారు. నిశ్చలంగా విన్నారు.

శ్రీనివాసు ఆగలేదు. మళ్ళీ అన్నాడు "ఉదాహరణకి మానాన్నగారినే తీసుకోండి. ఆయన పట్టిన కుందేటికి మూడేకాళ్ళంటారు. అసలు అవతలవాడు చెప్పింది మరి వినిపించుకోరుకదా! పెళ్ళి నూరేళ్ళ పంట అంటారు; మరి, పెళ్ళి చేస్తున్నప్పుడు వధూవరుల ఇష్టాలనుకూడా గమనించాలిగా? మనసు లేని కాపురం ఎన్నాళ్ళని చేయగలరు మాష్టారూ!"

మౌనంగా వింటూ కూర్చున్నారు రమణమూర్తిగారు.

"మానాన్నగారు ఒక సంబంధం చూశారు. అంతకు ముందే నేనో అమ్మాయికి మాట ఇచ్చాను నేనూ

సరళా ప్రేమించుకున్నాం. సరళ నన్ను నమ్ముకుంది. నామీది ఆమె నమ్మకాన్ని, విశ్వాసాన్ని వమ్ము చేయడం తగదు మాష్టారూ! ఆమెను తప్ప మరొకరిని పెళ్ళి చేసుకోలేను మాష్టారూ...మీ రన్నీ తెలిసినవారు. మీ మాటమీద మా నాన్నగారికి నమ్మక ముంది, గౌరవ ముంది మా నాన్న గారికి చెప్పండి మాష్టారూ! ఈ పెళ్ళి జరిపిస్తే, మే మిద్దరం జీవితకాలం మీకు ఋణపడిఉంటాం."

రమణమూర్తిగారు శ్రీనివాసుకి ఏంచెప్పాలో ముందే ఆలోచించుకోవ డంవల్ల స్థిరంగా అడిగారు. "చూడు శ్రీనివాసూ! నే నడిగినదానికి సమా ధానం చెప్పవోయ్ ... ఏ నాన్నైనా తన కొడుక్కి అన్యాయం చేస్తాడు అంటావా?"

"చెయ్యడండి"

"సరేనా? మరి ఇటువంటప్పుడు మీ నాన్నగారు చేస్తున్నది రైటే నం టావా? జీవితంలో ఢక్కా మొక్కీలు తిన్నవాళ్ళకి తప్ప నీలాంటివాడి కేం అనుభవాలున్నాయని స్వంతంగా ఆలో చించుకోవడం? నీ కేం తెలుసునోయ్ ప్రపంచమంటే?— నీ కేమీ తెలియదు. క్షణికోద్రేకంలో ఎవరో అమ్మాయిని పెళ్ళి చేసుకోకపోతే జీవితం లేదని అనుకోడం పొరపాటోయ్. నీది ఉడుకు రక్తం ఆవేశం ఎక్కువ. తరు వాత నువ్వు వూహించుకున్న దంతా తల క్రిందులయేసరికి జీవితంమీద విరక్తి అదీనూ ... ఎందుకొచ్చిన గొడవ. పెద్దవాడిగా, మీ కుటుంబ శ్రేయోభి లాషిగా నా సలహా ఏమిటంటే, నాన్న గారు చూసిన సంబంధాన్ని లక్షణంగా చేసుకోమని. ఈకాలం కుర్రాళ్లు తమం తట తాముగా ఏదీ ఆలోచించుకో లేరోయ్. అంచేత, పెద్దవాళ్ళు ఆలో చించి చేసినదాన్ని అంగీకరించాలి. అనవసరంగా మీ నాన్నగారి మనస్సు నొప్పించడ మెందుకోయ్!"

శ్రీనివాసు మాట్లాడలేదు.

ఒక్కనిముషం పోయిన తరువాత కుర్చీలోనుండి లేచాడు. "క్షమించండి మాష్టారూ! మీ మాట కాదంటున్నం దుకు మీరు పెద్దవారనీ, విజ్ఞులనీ, లోకాన్ని పూర్తిగా అర్థం చేసుకున్న వారనీ అనుకున్నాను. మీరుకూడా ఆ చాదస్తుల జాబితాలోనే చేరిపోతా రనుకోలేదు. వస్తాను మాష్టారూ!" రెండడుగులువేసి, ఆగి మళ్లీఅన్నాడు. "మరోమాట మాష్టారూ! ఈ పుణ్యం కూడా కట్టుకోండి. ఈ సలహానే మా నాన్నగారికి ఇచ్చి ఆయన్ని ప్రోత్సహించండి. నాకు మేలు చేసిన వారవుతారు." వ్యంగ్యంగా నవ్వేసి గబగబా బయటకు నడిచాడు శ్రీని వాసు.

శ్రీనివాసు వెళ్ళిన ఐదారు నిము




షాల వరకూ రమణమూర్తిగారు తేరుకోలేకపోయారు. ఎక్కడ లేని నిస్సత్తువ ఆయన్ని ఆవరించింది సొమ్మసిల్లిపోయినట్టు ఒక్క అరగంట అలానే పడుకున్నారు. రామచంద్రం రాసిన ఉత్తరాన్ని మనసులోనే మరోసారి చదువుకున్నారు. ముచ్చెమటలు పోశాయి వణికిపోయారు. ఆ ఉత్తరంలో రామచంద్రానికి బదులు శ్రీనివాసు కనబడుతుంటే దుఃఖాన్ని ఆపుకోలేకపోయారు. ఉత్తరీయాన్ని మొహానికి కప్పుకొని నిశ్శబ్దంగా ఏడ్చారు పదిహేను నిమిషాల తరువాత, ఏదో నిశ్చయానికొచ్చిన వారిలా కాగితం, కలం పట్టుకున్నారు. చేతులు వణుకుతుంటే కాగితంమీద కలం పెట్టారు.

"చిరంజీవి రామచంద్రానికి,

ఆశీస్సులు.

నువ్వు రాసిన ఉత్తరం అందింది. లోకం మారిపోయింది. పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. మనుషులు తప్పనిసరిగా మారాలి. నీ వర్ణాంతర వివాహానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను "

కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అక్షరాలు మసక మసకగా కన్పిస్తుంటే ఆ ఉత్తరాన్ని పూర్తి చేయలేకపోయారు——